## క్లుప్తంగా

### అన్నదానం



ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి వద్ద అన్నదానం చేస్తున్న డాక్టర్ ఎస్‌ఎం.ముజీబ్ హుస్సేని

**అబిడ్స్:** టీఎస్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, అసద్ అన్వార్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో ఎంఎస్‌జే కేన్సర్ ఆస్పత్రి వద్ద శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. మానవ సేవయే మాధవ సేవా అన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విక్రమ్‌కుమార్, రాజ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, శంకర్, ఖురేషి, అరుణ్‌జ్యోతి, శివకుమార్, చంద్రశేఖర్, మహ్మద్ అబ్దుల్ ముజీబ్, మహ్మద్ వహీద్, ముస్తఫా షరీఫ్, అబ్బాస్, నవీన్ పాల్గొన్నారు.

**ఆస్పత్రుల వద్ద అన్నదానం**

**గోల్కొండ:** ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద తాము చేపట్టిన అన్నదాన కార్యక్రమం నేటి ఒక సంవత్సరం పూర్తయిందని గోల్కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సంఘ సేవకుడు బషీరుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన పలు ఆస్పత్రుల వద్ద రోగులు, వారి సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను చేపట్టిన ఈ పుణ్య కార్యానికి తన స్నేహితులు, సహ ఉద్యోగులు, సమాజ సేవకుల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. కొంత కాలంగా తనకు తాము అన్నదాన కార్యక్రమానికి సహాయపడుతామని తనకు ఫోన్‌లు వస్తున్నాయని ఆయన అన్నారు.

### అత్యాచార కేసులో 20 ఏళ్లు జైలు శిక్ష

**జియాగూడ:** ఓ మైనర్ బాలికపై అత్యాచారం చేసిన నేరస్తుడికి నాంపల్లి 12వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించింది. ఈ మేరకు శుక్రవారం టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వివరాలను వెల్లడించారు. కార్వాన్ రాయల్సి హోటల్ ప్రాంతంలో ఉంటున్న సయ్యద్ సైఫ్‌ఉల్లా ఖాద్రి(39) అరబిక్ టీచర్. 2021 లో సయ్యద్ సైఫ్‌ఉల్లా 3వ పెళ్లి చేసుకున్నాడు. అప్పటికే ఆ మహిళకు 13 ఏళ్ల మైనర్ బాలిక ఉంది. ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో సైఫ్‌ఉల్లా మైనర్ బాలికపై అత్యాచారం చేశాడు. విషయం తెలుసుకున్న భార్య టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం 12వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్ జడ్జి టి.అనిత వాదోపవాదాల అనంతరం నేరస్తుడు సైఫ్‌ఉల్లాకు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారు. డబ్బులు చెల్లించలేని పక్షంలో మరో 6 నెలలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తెలియజేశారు.

**చిన్నారిపై లైంగిక వేధింపుల నిందితుడికీ..**

**అబిడ్స్:** ఓ చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ 12వ ఏఎంఎస్‌జే న్యాయస్థానం మెజిస్ట్రేట్ అనిత తీర్పునిచ్చారు. మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధి ఇంద్రానగర్‌లో ఉండే ధన్‌రాజ్ గతేడాదిలో ఇంటి సమీపంలో ఉండే ఐదేళ్ల చిన్నారిని ఇంట్లోకి పిలిపించి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఫిర్యాదు నమోదు చేసుకున్న గోషామహల్ ఏసీపీ సతీష్‌కుమార్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ రవి పోక్సో చట్టం క్రింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. శుక్రవారం న్యాయమూర్తి నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్షతో పాటు, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

### జీతాలు చెల్లించాలని కార్మికుల నిరసన

**రాజేంద్రనగర్:** కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించడంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించి ఆదుకోవాలని రామకృష్ణ హోమియో ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పని చేసిన కార్మికులు కోరుతున్నారు. కాటేదాన్‌లోని పరిశ్రమను మూసి వేయడంతో ఇబ్బందులు పడుతున్నట్లు కార్మికులు తెలిపారు. శుక్రవారం పరిశ్రమ ఎదుట కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగులకు జీతాలు చెల్లించలేదని, ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్ తదితర వాటిని చెల్లించాల్సి ఉందన్నారు. నాలుగు సంవత్సరాలుగా పీఎఫ్ పెండింగ్‌లో ఉందని, మూడు నెలల జీతాలు చెల్లించలేదన్నారు. వెంటనే తమకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జి.ప్రవీణ్‌కుమార్, సి.శివశంకర్, ఎస్.రమారెడ్డి, ఏ.బాబు, కె.బాల్‌రాజ్ పాల్గొన్నారు.

### 14న కవి సమ్మేళనం

**లిబర్టీ:** మహనీయుల పోరాట యోధుల త్యాగం వల్ల దేశానికి స్వాతంత్రం సిద్ధించిందని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 75 ఏళ్ల స్వాతంత్ర్యం, ఆత్మబలిదానం చేసిన మహనీయులను స్మరించుకోవడానికి ఆదిలీలా ఫౌండేషన్ లావణ్య ఆర్ట్ థియేటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14న ఢిల్లీలో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# జీవ వైవిధ్యాన్ని కాపాడేది గ్రామీణ ప్రజలే

**ఎమ్మెల్సీ గోరటి వెంకన్న**



మాట్లాడుతున్న గోరటి వెంకన్న

**చార్మినార్:** జీవ వైవిధ్యాన్ని కాపాడేది గ్రామీణ ప్రజలేనని ప్రజా కవి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. గ్రామీణ వృత్తి జీవితంతో ముడిపడి ఉన్న ప్రజలు వందల పిట్టల పేర్లు, ఆవుల పేర్లు, చెట్ల పేర్లను అలవోకగా చెబుతారన్నారు. సిటీ కాలేజీలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు సాహిత్యం–పర్యావరణ చైతన్యంపై రెండు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ సదస్సు చివరి రోజైన శుక్రవారం ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశంలో బౌద్ధ కలం నుంచే ప్రకృతి సంరక్షణ తెలిసి దాటి పట్ల మరింత అవగాహన పెరిగిందన్నారు. ప్రపంచానికి పర్యావరణపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించింది బుద్ధుడేనన్నారు. సకల జీవరాశికి సమాన గౌరవం ఇవ్వాలనే అంశాలను బౌద్ధ సాహిత్యంలో క్లియర్‌గా పేర్కొన్నారన్నారు. తన ప్రసంగం మధ్య మధ్యలో పాటలు పాడుతూ మంత్ర ముగ్ధులను చేశారు. ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో డాక్టర్ రెంటాల జయదేవ్, గౌరీ కృపానందన్, డాక్టర్ వి.శంకర్, డాక్టర్ బూర్ల చంద్రశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సులో నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

# సాలార్‌జంగ్ మ్యూజియంలో 'సిన్స్' సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ నాగేందర్‌రెడ్డి

**చార్మినార్:** నాణేల పరిశోధన నిరంతరం కొనసాగాలని సాలార్‌జంగ్ మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ నాగేందర్‌రెడ్డి అన్నారు. సాలార్‌జంగ్ మ్యూజియం సహకారంతో సౌత్ ఇండియన్ నుమిస్మాటిక్ సొసైటీ(సిన్స్) శుక్రవారం తన సొసైటీ 31వ వార్షిక సదస్సును మ్యూజియంలోని ఈస్టర్న్ బ్లాక్‌లో నిర్వహించారు. రెండు రోజుల పాటు జరుగనున్న ఈ సదస్సులో భారత ప్రభుత్వ మింట్ సీజీఎం డాక్టర్ వి.ఎస్.ఆర్.నాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సదస్సును మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ నాగేందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి అతిథులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురాతన నాణేల పరిశోధనలో సిన్స్ ఎంతో కృషి చేస్తుందని అభినందించారు. అందరికీ శాలువాలు కప్పి మెమొంటోలతో సత్కరించారు. సదస్సుకు ప్రొఫెసర్ ఎస్.రాజవేలు అధ్యక్షత వహించగా.. సిన్స్ ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజారెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్



మానవ అస్థిపంజరాన్ని వివరిస్తున్న విద్యార్థిని ఫాతిమా, సోఫియా తదితరులు

**గోల్కొండ:** విద్యార్థులను సరైన మార్గదర్శనం చేస్తే వారు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తారని వీనస్ విద్యా సంస్థల చైర్మన్ మహ్మద్ హిదాయతుల్లాఖాన్ అన్నారు. శుక్రవారం టోలిచౌకి డీలక్స్ కాలనీలోని వీనస్ హైస్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాథమిక స్థాయి విద్యార్థులతో పాటు ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ మెదడుకు పదును పెట్టారు. ఉపాధ్యాయులు సైతం ఊహించలేని విధంగా అద్భుతమైన ప్రాజెక్టులు తయారు చేసి అబ్బురపరిచారు. సల్మా అనే విద్యార్థి ఎంతో నేర్పుగా రక్తనమూనాలు సేకరించి మధుమేహం గురించి వివరించారు. ఫాతిమా సోఫియా అనే విద్యార్థినీలు మానవ అస్థిపంజరాన్ని తయారు చేసి వాటి భాగాలను ఎంతో చక్కగా వివరించారు.

## అలరించిన నృత్య ప్రదర్శన

**గన్‌ఫౌండ్రీ:** అభినేత్రి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ నృత్య గురువు ఆకృతి సుజాత, శివచంద్ర కుమార సుందరం శిష్యురాలు జొన్నలగడ్డ సంగీత భరతనాట్యం నృత్య ప్రదర్శన శుక్రవారం కింగ్‌కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పాంజలి, సరస్వతి కౌత్వం, శంభో మహదేవ వంటి పలు అంశాలకు చక్కటి హావభావాలతో చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ దీపికారెడ్డి, సంగీత విద్వాంసుడు డీఎస్‌వి శాస్త్రి పాల్గొన్నారు.



## డిజిటల్ టెక్నాలజీ గ్రామాలకు చేరువ కావాలి



కార్యక్రమంలో డాక్టర్ రమాదేవికి మెమొంటో అందజేస్తున్న యూనివర్సిటీ అధ్యాపకులు

**సుల్తాన్‌బజార్:** డిజిటల్ టెక్నాలజీని గ్రామాలకు చేరువ కావాలని ఏఎల్‌ఈఏపీ హైదరాబాద్ చైర్‌పర్సన్ డాక్టర్ రమాదేవి అన్నారు. తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయ ఉమెన్స్ సెల్ ఆధ్వర్యంలో కోఠి మహిళా విశ్వ విద్యాలయం ఆడిటోరియంలో జాతీయ సెమినార్ అయిన డిజిటల్ ఇన్నోవేషన్ టెక్నాలజీలో లింగ సమానత్వం అనే అంశంపై ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ రమాదేవి హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే అవకాశాలు నేటి యువత అందిపుచ్చుకోవాలన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ఉమెన్స్ స్టడీ సెంటర్ డైరెక్టర్ సునితా రాణి మాట్లాడుతూ.. సమాజంలో డిజిటల్ విప్లవం రావాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ పత్రిక సిటీ ఎడిటర్ నరేష్‌కుమార్, డాక్టర్ కాంచన, ప్రొఫెసర్ గీతారాణి, మహిళా కళాశాల వీసీ విజ్జులత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజ, డాక్టర్ పావని, విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ పునరుద్ధరణ వ్యతిరేక శక్తులను ఓడించాలి



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు నరేందర్‌రావు

**సుల్తాన్‌బజార్:** పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి తెలంగాణ స్టేట్ సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం అబిడ్స్‌లోని భీమా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ కేంద్ర కార్యాలయానికి వచ్చారని తెలిపారు. 9 జిల్లాల్లో ఉన్న సీపీఎస్ ఉపాధ్యాయుల సంపూర్ణ మద్దతు కోరుతూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్‌ను కలవడం జరిగిందన్నారు. కేంద్ర సంఘం ఆదేశాల మేరకు పాత పెన్షన్ పునరుద్ధరణ వ్యతిరేక శక్తులను అంతం చేయాలనే ఏకైక లక్ష్యంతో పెట్టుబడిదారి పెన్షన్ పథకానికి వత్తాసు పలుకుతున్న బీజేపీ పార్టీ అభ్యర్థినిని ఓడించాలని హైదరాబాద్ జిల్లా శాఖ పిలుపునిచ్చిందన్నారు. మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 30 శాతం ఓట్లు సీపీఎస్ ఉపాధ్యాయులవే అన్నారు. గెలుపు ఓటముల సీపీ ఎస్ ఉద్యోగుల పాత్ర కీలకమైందని ప్రకటించారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి సత్యనారాయణ అసోసియేట్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ ప్రభాకర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత





హెల్మెట్ అందజేస్తున్న గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

**గోల్కొండ:** రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం గోల్కొండ ద రైజింగ్ స్టార్ నేషనల్ హైస్కూల్‌లో రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ వర్క్‌షాపులో భాగంగా రైడ్ టూ సేఫ్టీ క్యాంపెయినింగ్ నిర్వహించారు. ఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ వారు ట్రాక్ ఎస్ సొసైటీ, ఏ రోడ్ సేఫ్టీ ఎన్జీఓతో హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థి, వారి తల్లి లేదా తండ్రికి హెల్మెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులు కౌమారదశతో పాటు ప్రారంభ టీనేజ్‌లో ఉంటారని వారికి రోడ్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఆయన అన్నారు. పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించే సమయంలో డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీబుక్, ఇన్సూరెన్స్‌తో పాటు వాహన పరీక్షకు సంబంధించిన పత్రాలు పరిశీలిస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సయ్యద్ షెహబాద్ అహ్మద్‌ఖాద్రి, సయ్యద్ అహ్మద్ ఖాద్రి, ఈవెంట్ కో ఆర్డినేటర్ షేక్ ఫెరోజ్, ట్రాక్ ఎస్ సొసైటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాజేష్ నీల్‌కర్ తదితరులున్నారు.

## వీర హనుమాన్ విజయ యాత్రను విజయవంతం చేయాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ బజరంగ్‌దళ్ నాయకులు

**సుల్తాన్‌బజార్:** హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఏప్రిల్ 6న జరిగే వీర హనుమాన్ విజయ యాత్ర (బైక్‌ర్యాలీ)ను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం కోఠిలోని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బైక్ ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వీర హనుమాన్ విజయయాత్ర ఏప్రిల్ 6న గౌలిగూడలోని రామ్ మందిర్ నుంచి తాడ్‌బన్ హనుమాన్ ఆలయం వరకు జరుగుతుందన్నారు. అదేవిధంగా కోఠి ఆంధ్రాబ్యాంక్ చౌరస్తాలో లక్షమందితో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందన్నారు. ఈ యాత్రకు వీహెచ్‌పీ బజరంగ్‌ద్ నాయకులు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ కార్యదర్శి పండరినాథ్, సంఘటన కార్యదర్శి యాదిరెడ్డి, ప్రాంత ఉపాధ్యక్షుడు జగదీశ్వర్, బజరంగ్‌దళ్ తెలంగాణ కన్వీనర్ శివరాములు, మహేష్ యాదవ్, భరత్‌వంశీ, సుభాష్ చందర్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

## జైరామ్ రమేష్‌కు సత్కారం



**అబిడ్స్:** ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్‌ను శుక్రవారం ఘనంగా సత్కరించారు. గాంధీభవన్‌కు వచ్చిన ఆయనను గోషామహల్ నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి నిర్మల్‌కుమార్ యాదవ్, శ్యామ్‌సింగ్ సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ అసత్య మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని పేర్కొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ఆందోళన చేపడతాం

**అబిడ్స్:** ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని గోషామహల్ నియోజకవర్గం టీడీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఏఎస్.రావు పేర్కొన్నారు. నియోజకవర్గం పరిధిలోని జాంబాగ్ ప్రాంతంలో ఇంటింటా పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గం నలుమూలలా పర్యటిస్తూ ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. నియోజకవర్గం నలుమూలలా ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రేటర్ టీడీపీ నాయకులు రవీంద్రచారి, సాయిబాబా, జగపతి మహేష్, రాజు ముదిరాజ్, ప్యాట నందకిశోర్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

**DOCUMENT LOST**

I, Phaneendra S/o. T. Sridhar Rao I Lost Original link Doc No.3914/2003 Original Aadhar, Driving Licence & Xerox Land Doc. While Travelling from Nizampet to Mehidipatnam by bus If any body find Call: 7418344920

## మహిళా శక్తితోనే సామాజిక అభివృద్ధి



సంఘ సేవకురాలు శైలజ క్రాంతిని సత్కరిస్తున్న ఎస్.ఏ ముజ్జమిల్ పాష తదితరులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముత్యాల దుర్గారాణి తదితరులు

**అబిడ్స్:** మహిళా శక్తితోనే సామాజిక అభివృద్ధి కొనసాగుతుందని గోదావరి అర్బన్ బ్యాంక్ మేనేజర్ ఎస్.ఏ.ముజ్జమిల్ పాష పేర్కొన్నారు. మహిళల సంక్షేమానికి, మహిళల అభివృద్ధికి అందరూ ప్రోత్సహించాలన్నారు. శుక్రవారం ఉస్మాన్‌గంజ్‌లోని బ్యాంకు కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు, సావిత్రిబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో విశేష సేవలందిస్తున్న సామాజిక సంఘ సేవకురాలు ఎస్.శైలజ క్రాంతితో పాటు హైకోర్టు న్యాయవాది బి.జ్యోతి తదితరులను ఘనంగా సత్కరించారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ ముజ్జమిల్ పాష మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించే విధంగా కుటుంబసభ్యులతో పాటు ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. అదేవిధంగా గీతా, జ్యోత్స్న జైన్, స్వీటీలాంకా, సరితా జైన్, ఖుస్బులను ఘనంగా సత్కరించి మెమొంటోలు అందజేశారు. బ్యాంక్ ఆఫీసర్ కాల సాయిప్రసాద్, సాయికిరణ్‌రెడ్డి, వనజ, లక్ష్మి, మహేష్ పాల్గొన్నారు.

**కార్వాన్‌లో మహిళా దినోత్సవం**

**గోల్కొండ:** మహిళలు తలుచుకుంటూ వారు చేయలేని పని లేదని కార్వాన్ హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు ముత్యాల దుర్గారాణి అన్నారు. శుక్రవారం కార్వాన్ హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ స్వాతి, పారిజాతం, లక్ష్మి, భార్గవి పాల్గొన్నారు.

**మహిళకు మహిళలే అండగా నిలవాలి..**

**గన్‌ఫౌండ్రీ:** మహిళలకు మహిళలే అండగా నిలబడాలని పలువురు మహిళా సంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో విశ్వంభర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సువర్ణ కుమారి, ఉపాధ్యక్షురాలు వినిత, అనన్య ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నవనీత, మానవ హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ ఆర్.వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

**గోల్కొండ:** విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులతో పాటు దేశం గర్వపడేలా ఎదగాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన టోలిచౌకిలో మాతృభాషలో చదివే విద్యార్థులకు సాలార్ ఏ మిల్లత్ ఫౌండేషన్ తరఫున 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ పార్టీ అసదుద్దీన్ ఒవైసీతో పాటు మజ్లిస్ శాసనసభా పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ తన మాతృభాషలో చదివే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన వెంటనే సాలార్ ఏ మిల్లర్ తరఫున విద్యార్థులకు నోట్ బుక్స్ తోపాటు పుస్తకాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, పలువురు మజ్లిస్ నాయకులు ఉన్నారు.

## తల్లిదండ్రులను గౌరవించాలి



వృద్ధుడికి సరుకులను అందజేస్తున్న నాగ్‌నాథ్ మాశెట్టి, మల్లికార్జునప్ప

**చార్మినార్:** సమాజంలో డబ్బే ప్రధానం కాదని.. తల్లిదండ్రులను గౌరవించి ప్రేమగా చూసినప్పుడే మానవ జన్మ సార్థకమవుతుందని టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు నాగ్‌నాథ్ మాశెట్టి అన్నారు. కోకర్‌వాడికి చెందిన నాగ్‌నాథ్ మాశెట్టి–జగదేవీ దంపతుల 53వ వివాహ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం వృద్ధాశ్రమంలోని వృద్ధ దంపతులకు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. డబ్బుతో కొంత మంది, ఛీదరించుకుని కొంతమంది తమ తల్లిదండ్రులను అనాథాశ్రమాల్లో వదిలేయడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు మల్లికార్జునప్ప తదితరులు పాల్గొన్నారు.

**వేద పండితురాలి పాదపూజ..**

ఏపీలోని రాజమండ్రికి చెందిన వేద పండితురాలు లక్ష్మీనర్సమ్మ, తన రెండో కుమారుడైన కృష్ణామాచారితో కలిసి ఇక్కడి అనాథాశ్రమంలో ఉంటోంది. తన కుమారుడు కృష్ణామాచారితో కలిసి నాగ్‌నాథ్ మాశెట్టి పాదపూజ చేశారు.

## అంబేడ్కర్ సేవల గురించి యువతకు వివరించాలి



**రాజేంద్రనగర్:** పేదల అభ్యున్నతికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన సేవలను నేటితరం యువతకు వివరించాల్సిన అవసరం ఉందని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ అన్నారు. కేవీపీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో నేతాజీనగర్ స్కూల్‌లోని మైదానంలో అంబేడ్కర్ జీవిత చరిత్రను నాటకం రూపంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాన్‌వెస్లీ హాజరై అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ, దాని అనుబంధ సంస్థలు ప్రజలపై దాడులు చేస్తున్నాయన్నారు. కేవీపీఎస్ మండల అధ్యక్షుడు జి.ఎం.గట్టమ్మ, జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి బి.శామ్యూల్, ప్రకాష్, సీపీఎం మండల కార్యదర్శి జి.ఎం.కురుమయ్య, బీఆర్ఎస్ నాయకులు పి.సుధాకర్‌గౌడ్, గట్టయ్య, కే.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# సావిత్రీబాయి పూలే సేవలు చిరస్మరణీయం



సావిత్రీబాయి వర్ధంతి వేడుకల్లో మనోహర్ గైక్వాడ్, విద్యార్థులు

**అబిడ్స్:** సావిత్రీబాయి పూలే వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మంగళ్‌హాట్ గుఫానగర్‌లో బుద్దిస్ట్ లైబ్రరీ, ఫ్రీ ట్యూషన్ నిర్వాహకుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మెహర్ ఎస్సీ డెవలప్‌మెంట్స్ సొసైటీ అధ్యక్షుడు మనోహర్ గైక్వాడ్ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**సావిత్రీబాయి పూలేకు ఘన నివాళి..**

**గోల్కొండ:** శతాబ్దం క్రితమే మహిళలను చైతన్యవంతులను చేయడానికి నడుం బిగించిన సావిత్రీబాయి పూలే నేటి మహిళలకు ఆదర్శమని కార్వాన్ ఐక్యవేదిక అధ్యక్షుడు ప్రకాశ్ అన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతిని శుక్రవారం గుడిమల్కాపూర్‌లోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొల్లూరి అనీల్ కుమార్, ప్రొఫెసర్ నర్సింగ్‌దాస్, మల్లికార్జున్, అంబటి శ్రీనివాస్ తదితరులున్నారు.

**నాంపల్లిలో..**

**నాంపల్లి:** భారతీయ సమాజంలో స్త్రీ విద్య కోసం శ్రమించిన తొలి ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే అని మెదక్ అదనపు జిల్లా కలెక్టర్ ఎనుగు నర్సింహారెడ్డి కొనియాడారు. శుక్రవారం పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ప్రాంగణంలో టీయూ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో జరిగిన సావిత్రీబాయి పూలే వర్ధంతి సభకు ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. సావిత్రీబాయి పూలే భారతీయ స్త్రీ సాధికారతకు చిహ్నం అని అన్నారు. సామాజిక సేవలో, సాహిత్య కృషిలో ఎనలేని సేవలు అందించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మంగి వేణుగోపాల్, కేపీ.అశోక్‌కుమార్, స్టడీ సర్కిల్ అరవింద్, జితేందర్, పవిత్ర, ప్రవీణ్, అరుణజ్యోతి, కల్యాణి, మనోహర్, చరణ్, సంజీవ్, మౌనిక, వైష్ణవి, వాగ్దేవి తదితరులు పాల్గొన్నారు.



టీయూ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో..



గుడిమల్కాపూర్‌లో..

సాక్షి

మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.

9010221230
9010463222
9553955684